సాక్షి
అనకాపల్లి
గురువారం । 24 । ఆగస్టు । 2023



విద్యార్థి దశ చాలా కీలకం

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మాద కద్రవ్యాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు. IIలో



అమ్మవారికి జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు పసుపు నీటి బిందెలతో బుధవారం జలాభిషేకం చేశారు.



డీఆర్ఎం తనిఖీలు

విశాఖ: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ బుధవారం డీజిల్ లోకో షెడ్‌లో తనిఖీలు జరిపారు.

న్యూస్‌రీల్

టంగుటూరి స్ఫూర్తితో దేశసేవ చేయాలి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఆంధ్రకేసరి టంగుటూరి స్ఫూర్తితో దేశసేవలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బుధవారం టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాస్‌లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటీష్ వారి తుపాకీకి ఎదురు నిలిచి తన గుండెను చూపించడంతో ఆంధ్రకేసరి అయ్యారని తెలిపారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించి, ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని కొనియాడారు. ఆయన దేశానికి చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తన న్యాయవాద వృత్తిని, ఆస్తిని వదులుకున్న మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్‌డీ అనిత, ఏవో ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచార్య సి.ఆర్.రావుకు నివాళి



ఆచార్య సి.ఆర్.రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీవో జి.రామారావు

తుమ్మపాల: సాంఖ్యకశాస్త్ర యుగపురుషుడు, పద్మవిభూషణ్ ఆచార్య సి.వి.రావు చిత్రపటానికి జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సి.ఆర్.రావు సేవలను కొనియాడారు. 102 సంవత్సరాల పాటు పరిపూర్ణ జీవితం గడిపి, ప్రపంచంలోని ఎన్నో గణిత రహస్యాలను పరిష్కరించి దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశారన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం జరిగి, సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కాన్ఫరెన్సు హాలులో కోఆర్డినేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా అన్ని కోర్టుల్లో అన్ని రకాల కేసులు పెద్ద సంఖ్యలో రాజీ చేయాలన్నారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, బార్ ప్రెసిడెంట్ చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు బైపా అరుణ్ కుమార్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం-ఏపీఎస్ఎస్‌డీసీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సంయుక్తంగా 60 రోజుల పాటు నిర్వహించే ఇండస్ట్రీ ఓరియంటేషన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకి డిప్లమా, బీటెక్, ఎంటెక్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కోర్సు ఫీజుగా రూ.10 వేలు చెల్లించాలన్నారు. మొత్తం 7 కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. వివరాలకు 98480820995, 9652690534 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాబిల్లిని ముద్దాడిన వేళ...

అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త చరిత్ర లిఖించింది. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా దింపి జయకేతనం ఎగురవేసింది. చందమామను అందుకున్న వేళ అన్ని వర్గాల్లో ఆనందం ఉప్పొంగింది. ఇస్రో శాస్త్రవేత్తలకు విద్యార్థులు విభిన్నంగా అభినందనలు తెలిపారు. అక్షర విన్యాసంతో ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారం చూసి కేరింతలు కొట్టారు. బుధవారం సాయంత్రం జిల్లా అంతటా ఎక్కడ చూసినా ఇదే సందడి కనిపించింది. అందరూ టీవీలకు అతుక్కుపోయారు. సరిగ్గా 6.04 గంటలకు సేఫ్ ల్యాండింగ్‌ను చూసి చప్పట్లతో హర్షం ప్రకటించారు. మాడుగులలో పాఠశాల విద్యార్థులు ఇస్రో ఆకృతిలో విన్యాసం ప్రదర్శించారు. మాకవరపాలెం మండలంలోని తూటిపాల యూపీ స్కూల్లో ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు చంద్రయాన్ నమూనానుతయారు చేశారు. పాఠశాల హెచ్ఎం రాము విద్యార్థులకు చంద్రయాన్-3 ప్రత్యేకతను వివరించారు. –సాక్షి న్యూస్ నెట్‌వర్క్





ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనగా విద్యార్థుల అక్షర విన్యాసం

ప్రతి భారతీయుడికి ఆనందకర క్షణాలు



ఏ దేశం సాధించని విధంగా చంద్రుని దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ సరికొత్త రికార్డు సాధించింది. ఇస్రో శాస్త్రవేత్తల కృషి వెలకట్టలేనిది. ఈ మిషన్‌లో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు.

–బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

శాస్త్రవేత్తలకు అభినందనలు



భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ స్థాయిలో చాటిచెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలందరికీ అభినందనలు. అంతర్జాతీయంగా సత్తా చాటి చంద్రమండలంపైకి విక్రమ్ ల్యాండర్‌ను పంపడం చిన్న విషయం కాదు. ఇది దేశ ప్రజలకు గర్వకారణం.

–కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్

దేశానికి గర్వకారణం



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంతో భారతదేశంలో ప్రతీ ఒక్కరూ గర్విస్తున్నారు. చంద్రుని ఉపరితలంపై ప్రయోగాలను చేపట్టేందుకు నిర్వహించిన చంద్రయాన్-3 ప్రయోగంను విజయవంతం చేయడంలో శాస్త్రవేత్తల పాత్ర ప్రముఖం.

–బి.చిన్నమ్మలు, కేజీబీవీ ప్రిన్సిపాల్, కింతాడ, కె.కోటపాడు మండలం

అద్భుతం



చంద్రయాన్-3 విజయం ఒక అద్భుతం. ఇస్రో శాస్త్రవేత్తలు సామాన్యులు కారన్న నిజం ప్రపంచానికి తెలిసింది. ఈ విజయంతో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం నేటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

– ద్వారపూడి తరుణ్‌కుమార్, ట్రిపుల్ ఐటీ విద్యార్థి, రావికమతం



మాడుగులలో ఇస్రో ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

మరెన్నో పరిశోధనలకు దోహదం



చందమామపై కాలు మోపడంతో 15 ఏళ్ల నాటి భారత్ కల సాకారమైంది. ఇస్రో ప్రయోగంవిజయవంతం కావడంలో శాస్త్రవేత్తలు పోషించిన పాత్ర కీలకమైనది. చంద్రుని ఉపరితలం పరిశీలన, చంద్రునిపై ప్రకంపనలు, ఖనిజాలు, రసాయనాలు, వాయువులు, అక్కడ నెలకొన్న థర్మో ఫిజికల్ లక్షణాలు, వాతావరణం, గ్లోబల్ ఇంటర్నెట్ తదితర అంశాల్లో పరిశోధనలకు దోహదపడుతుంది.

–జి.సత్తిబాబు, సైన్స్ ఉపాధ్యాయుడు, జీవీఎంసీ పెద్ద హైస్కూల్, అనకాపల్లి

చారిత్రక ఘట్టానికి మనమంతా సాక్షులం



చంద్రయాన్-3 విజయవంతం కావడం ఒక చరిత్రాత్మక ఘట్టం. దీనికి సాక్షులుగా నిలవడం మన అదృష్టం. ఇస్రో శాస్త్రవేత్తల బృందం కృషి ఫలితంగా ప్రపంచపటంలో భారత్ అగ్రభాగాన నిలిచింది.

–ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు, మాజీ వీసీ, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ



మాకవరపాలెం: తూటిపాల యూపీ స్కూల్లో చంద్రయాన్ నమూనాతో ప్రదర్శన



చంద్రయాన్-3 విజయాన్ని అభినందిస్తూ.. ఎన్ని చందమామలో..

గర్వించదగ్గ విజయం



చంద్రయాన్-3 విజయానికి కారణమైన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. ఇది యావత్ భారత్‌దేశం గర్వించదగ్గ విజయం. ఇస్రో మరెన్నో విజయాలు సాధించాలి. అంగారకుడి వైపు మనం అడుగులు వేయడానికి ఈ విజయం దోహదపడుతుంది.

–డాక్టర్ బి.వి.సత్యవతి, ఎంపీ, అనకాపల్లి



అనకాపల్లి గవరపాలెంలోని జీవీఎంసీ చిన్న హైస్కూల్లో ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న విద్యార్థులు

కలెక్టర్ వరాలు.. గిరిజనుల దీక్ష విరమణ

అణుకు గ్రామస్తుల ఆనందం



గెడ్డను దాటి అణుకు గ్రామానికి వెళుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



గిరిజనులకు మంచినీళ్లు తాగించి దీక్షను విరమింపజేస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: అణుకు గిరిజనుల శాంతియుత పోరాటానికి ఫలితం దక్కింది. జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి చొరవతో 48 రోజుల రిలే నిరాహార దీక్షకు ముగింపు వచ్చింది. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి గిరిజన గ్రామానికి వెళ్లడమే కాకుండా ఇంటింటికీ వెళ్లి వారి కష్టాలు, సమస్యలను నేరుగా చూశారు. మెయిన్‌రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే రహదారిలో కొంత మేర కాలినడకన గూడేనికి చేరుకున్నారు. కొండల్లో ఉన్న గిరిజనుల ఇళ్లను సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. ఇటీవలే ఏర్పాటైన ప్రత్యామ్నాయ పాఠశాలను సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. గిరిజన మహిళలతో వారి అలవాట్లు, కట్టుబాట్లు, తాగునీరు, ఆహారం, విద్యుత్ తదితర అంశాల గురించి ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డు ఉండాలని, ఎవరికైనా లేకపోతే వెంటనే చేయించాలని ప్రత్యేకాధికారికి సూచించారు. ప్రత్యామ్నాయ పాఠశాలకు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇళ్ల మంజూరు చేస్తామని చెప్పారు. రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణను ఆదేశించారు. రహదారికి సంబంధించి మూడున్నర కిలోమీటర్లు అటవీ శాఖ పరిధిలో ఉన్నందున, సమస్య తలెత్తకుండా ముందుగా గ్రావెల్ రోడ్డు నిర్మిస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణానికి నివేదిక తయారు చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. గిరిజనులకు ఏ సమస్య ఉండకుండా పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం నెలకోసారి గ్రామాన్ని సందర్శించి సమావేశం నిర్వహించి సమీక్ష చేయాలని ప్రత్యేకాధికారి ఉదయశ్రీకి సూచించారు. జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి పలుమార్లు జెడ్పీ సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి గిరిజనుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించడంలో సఫలీకృతులయ్యారు. జెడ్పీటీసీ అభ్యర్థన మేరకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నేరుగా సందర్శించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. దాంతో గిరిజనులు తమ దీక్షను విరమించుకున్నారు. జెడ్పీటీసీ ఉమాదేవి, ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ మంచినీళ్లు తాగించి దీక్షను విరమింపజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి జి.డేవిడ్‌రాజ్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనులు పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మునగపాక తహసీల్దార్ ప్రకాశరావు సస్పెన్షన్

మునగపాక: మునగపాక మండల తహసీల్దార్ పి.ప్రకాశరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. రెండు నెలల క్రితం పరవాడ నుంచి మునగపాకకు ఆయన బదిలీపై వచ్చారు. జగనన్న భూ రక్ష–భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంలో, సరిహద్దు రాళ్లను పాతించే ప్రక్రియలో బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడం, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వంటి కారణాలతో ప్రకాశరావును సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అచ్యుతాపురం తహసీల్దార్ వై.శ్రీనివాసరావును నియమించినట్లు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు ఆదాయ వనరు

- ద్వాక్రా మహిళలకు వరం.. పెరటి కోళ్ల పెంపకం
- ప్రతి మండలానికి 50 వంతున జిల్లాలో మొత్తం 1200 యూనిట్లు
- ఆరు మండలాల్లో పంపిణీ పూర్తి.. వచ్చే నెలలో మిగతా ప్రాంతాలకు..
- స్వయం సహాయక సంఘాలకు రాయితీపై ప్రభుత్వ రుణాలు



మదర్ పౌల్ట్రీ ఫాం




పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సాధికారతకు, ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దోహదపడుతోంది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా వచ్చే డబ్బును వృథా చేయకుండా చిన్న చిన్న వ్యాపారాలు, వ్యవసాయ పెట్టుబడులు, పాడి పశువుల పెంపకంతో ఆదాయం పెంచుకునేలా ప్రోత్సహిస్తోంది. డ్వాక్రాఇ మహిళలందరికీ అదనపు ఆదాయ వనరుగా పెరటి కోళ్ల పెంపకం మారుతోంది. డ్వాక్రా అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా మరింత ఎదగాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథంను తీసుకొచ్చింది. డీఆర్‌డీఏ ద్వారా 'అసీల్' రకం నాటుకోళ్లను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి రాయితీతో డ్వాక్రా మహిళలకు అందజేస్తున్నారు. జిల్లాలో 24 మండలాల్లో 1200 యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 6 మండలాల్లో (చోడవరం, కశింకోట, మాకవరపాలెం, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కె.కోటపాడు) ఈ ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన 18 మండలాల్లో వచ్చే నెల సెప్టెంబర్ నాటికి పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి మండలానికి 50 యూనిట్లు అందిస్తారు. ఒక్కో యూనిట్‌కు రూ.4 వేల విలువైన 11 అసీల్ జాతి పెరటి కోళ్లను (8 కోడి పెట్టలు, మూడు కోడి పుంజులు) అందిస్తున్నారు. ఈ సొమ్మును చెల్లించడానికి బ్యాంకుల ద్వారా రుణాలు సమకూరుస్తారు. డ్వాక్రా మహిళలు ఆ బాకీని అంచెలంచెలుగా చెల్లించవచ్చు. ఒక్కో కోడి బరువు కేజీ వుంటుంది. వాటితో పాటుగా దాణా, ఒక మెడికల్ కిట్ కూడా అందజేస్తున్నారు.

మండలానికి ఒక మదర్ పౌల్ట్రీ ఫాం

మండలానికొక మదర్ పౌల్ట్రీ ఫాంలను ఏర్పాటు చేసే విధంగా డీఆర్‌డీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు మదర్ పౌల్ట్రీ ఫాంలను ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామంలో రూ.5 లక్షలతో, చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేటలో రూ.2 లక్షలతో, కోటవురట్ల మండలంలో రాజుపేటలో రూ.8 లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. త్వరలో ప్రతీ మండలానికొకటి ఏర్పాటు చేసేలా అడుగులు వేస్తున్నారు. తొలుత జిల్లాలో 10 చోట్ల ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఆఖరు నాటికి 24 మండలాల్లో ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. మదర్ పౌల్ట్రీ ఫాం నుంచే ప్రతి యూనిట్‌కు కోళ్లను అందిస్తారు.


వ్యాధుల బారిన పడకుండా వ్యాక్సిన్లు



పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం. ఇళ్లలోని వ్యర్థాలతో కోళ్ల పెంపకం చేపట్టవచ్చు. పెరటి కోళ్ల పెంపకంతో గ్రామాల్లో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. పల్లెల్లో ప్రతి ఇంటిలో పెరటికోళ్లను పెంచుతుంటారు. అది ఆ ఇంటికి అదనపు ఆదాయవనరుగా ఉంటుంది. ఇప్పకే చాలాచోట్ల పంపిణీ చేశాం. ఈ పథకానికి జిల్లాలో మంచి స్పందన ఉంది. ఈ కోళ్లు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా వ్యాధి నిరోధక వ్యాక్సిన్‌ను గ్రామ సచివాలయాల్లోని పశువైద్య సహాయకులు వేసేలా ఏర్పాట్లు చేశాం.

–లక్ష్మీపతి, డీఆర్‌డీఏ పీడీ

అవగాహన ఉన్న వారికి మంజూరు



గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబాలతో పాటు ఇతర కుటుంబాలు కూడా పెరటి కోళ్లను పెంచుకుంటూ వాటి ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తారు. తక్కువ వ్యవధిలో లాభాలు ఆర్జించే వాటిలో పెరటి కోళ్ల పెంపకం ఒకటి. ప్రతీ యూనిట్‌లో కోళ్లకు వైద్యం అందించే బాధ్యత సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లకు అందించాం. 4 వేల విలువైన కోళ్లను కొనుగోలు చేసి తక్కువ వ్యవధిలో రూ.10 వేల ఆదాయం పొందవచ్చు. అవగాహన ఉన్న వారికే మదర్ పౌల్ట్రీ ఫాంలను మంజూరు చేస్తున్నాం.

– కె.సంజయ్‌బాబు, డీపీఎం

ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి

సమగ్ర ఓటరు సర్వేపై రాజకీయ పార్టీలతో జేసీ జాహ్నవి సమావేశం



ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనపై వివరిస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: జిల్లాలో ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి అయిందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టర్ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 1,526 పోలింగ్ కేంద్రాలలో 12 లక్షల 75 వేల 625 మంది ఓటర్లకుగాను, 12 లక్షల 46 వేల 634 మంది వివరాలను పరిశీలించామన్నారు. 3,657 మందిని కొత్త ఓటర్లుగా నమోదు చేశామన్నారు. నిర్ణీత వయసున్నప్పటికీ 15,013 మంది ఓటును ఇంకా నమోదు చేసుకోలేదని తెలిపారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న జాబితాలో 2,301 మందిని గుర్తించామన్నారు. 6,764 మంది శాశ్వత నివాసం మార్పు చేసుకున్నట్లు పేర్కొన్నారు. 33,029 మంది ఓటర్లు మృతి చెందినట్లు తేలిందన్నారు. 31,404 మంది ఓటర్ల వివరాల్లో తప్పులను సవరించినట్లు వెల్లడించారు. మొత్తం ఓటర్లలో 1,678 మంది దివ్యాంగులున్నట్లు తెలిపారు. తమ దృష్టికి రాని అంశాలుంటే తెలపాల్సిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. చాలా ఇళ్ల వద్దకు బీఎల్వోలు పరిశీలనకు వెళ్లలేదని వారు తెలపగా, ఆ వివరాలు సేకరించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్డీవో చిన్నికృష్ణను ఆదేశించారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్‌రోల్‌మెంట్ అధికారులు ప్రమీలాగాంధీ, జ్ఞానవేణి, రామలక్ష్మి, ఎన్నికల సూపరింటెండెంట్ లక్ష్మి, డీటీ రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు గొర్లి సూరిబాబు, గంటా శ్రీరామ్, సీహెచ్ నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, కె.హరినాథ్‌బాబు, ఎస్‌వీవీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్



ప్రమాదానికి గురైన వాహనాలు

అనకాపల్లిటౌన్: మండలంలో కొప్పాక జాతీయ రహదారిపై గాజువాక నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న వ్యాన్‌ను, కంటైనర్ బుధవారం ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డు పక్కనే ఉన్న పంటపొలాల్లోకి వ్యాన్ దూసుకుపోయింది. కంటైనర్ ముందు భాగం నుజ్జయింది. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి గాయపడిన డ్రైవర్‌ను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అచ్యుతాపురంలో కార్మిక శాఖ దాడులు



అచ్యుతాపురంలో దాడులు నిర్వహిస్తున్న కార్మిక శాఖ అధికారులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో కార్మిక శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అభిరామ్ గ్రాండ్ అపార్ట్‌మెంట్, ఇటుకల బట్టీలను పరిశీలించిన కార్మిక శాఖ అధికారులు ఆ ప్రాంతాల్లో 16 ఏళ్ల యువకునితో పనిచేయిస్తున్న యాజమాన్యంపై కార్మిక చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

నెల్లిపూడిలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

నక్కపల్లి: మండలంలో నెల్లిపూడిలో శ్రీశైలపు సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సత్యనారాయణ టైలరింగ్ చేస్తాడు. బంధువుకు అప్పు ఇవ్వడానికి తెచ్చిన రూ.లక్ష సోమవారం బీరువాలో పెట్టాడు. కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం చూడగా బీరువాలో ఉంచిన నగదుతోపాటు నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించ లేదు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ అప్పన్న, ఎస్‌ఐ శిరీషలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

విద్యార్థిగా మారి.. పాఠాలు విని

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సుడిగాలి పర్యటన



మూడవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఐఎఫ్‌పీ ద్వారా టీచర్ చెబుతున్న పాఠం వింటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కోటవురట్ల: జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కాసేపు విద్యార్థిగా మారి బయాలజీ ఉపాధ్యాయుడి పాఠం విన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించడమే కాకుండా, ఉపాధ్యాయుల బోధనా పటిమను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్య అందాలనే తపనతోనే తరచూ ఆయన స్కూళ్లను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే పాములవాక జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. తొలుత 3, 4 తరగతుల విద్యార్థులతో మమేకమయ్యారు. వారికి గణిత పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేశారు. నోట్ పుస్తకాలు పరిశీలించి పలువురు విద్యార్థులు సరిగా రాయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. 7వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల మధ్య బెంచీపై కూర్చుని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) ద్వారా బోధన చేయాలని బయాలజీ ఉపాధ్యాయుడిని ఆదేశించారు. ఉపాధ్యాయుడి బోధన పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా ఇలా బోధన చేయగలుగుతున్నారా? అని హెచ్ఎం నారాయణను ప్రశ్నించారు. డిజిటల్ బోధన ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, ఉపాధ్యాయులకు దీనిపై పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్ నిర్మాణాన్ని పరిశీలించి, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. జగనన్న గోరుముద్దను రుచి చూసి బాగుందంటూ, రోజూ ఇలానే వండుతున్నారా? అంటూ హెల్పర్లను నవ్వుతూ ప్రశ్నించారు. పిల్లలకు ఇలాంటి రుచికరమైన భోజనమే అందించాలని సూచించారు.

వైఎస్సార్ జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాల పట్ల ప్రోత్సహించాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీకి ఆదేశాలిచ్చారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన సుగర్ వ్యాధిగ్రస్తుడు చొప్పా ఈశ్వర్(4)కు ప్రభుత్వ పరంగా చికిత్సకు సాయం చేయాలని జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి కలెక్టర్‌ను కోరారు. రోజుకు నాలుగు సార్లు ఇన్సులిన్ చేస్తున్నారని, పేదవారు కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్సులిన్ ఉచితంగా ఇస్తారని, చికిత్స కోసం కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జయరాం, డీఈవో వెంకటలక్ష్మమ్మ, తహసీల్దారు జానకమ్మ, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, డీటీ సోమశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, కిల్లాడ శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అదనపు నైపుణ్యం కలిగి ఉండాలి

డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోనీడైసీ



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సోనీడైసీ

అనకాపల్లిటౌన్: విద్యార్థులు విద్యతో పాటు అదనపు నైపుణ్యం కలిగి ఉండాలని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోనీ డైసీ అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో బుధవారం జిల్లా యువజనోత్సవాలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సెట్విస్ అండ్ యూత్ సర్వీసెస్ జిల్లా మేనేజర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ స్వామి వివేకానంద సిద్ధాంతాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ యువజనోత్సవాలు జరుపుకోవడం ఎంతో అవసరం అన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ తనకు నచ్చిన రంగంలో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక గోల్‌ను నిర్దేశించుకోవాలని, కృషి, పట్టుదల ఉంటే సాధించి తీరుతామన్నారు. నృత్యం, పాటలు, పోస్టర్, స్టోరీ రైటింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి దాడి రత్నాకర్ షీల్డ్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకుముందు వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశాఖ నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, చార్టెడ్ అకౌంట్ ఎ.విజయచంద్రిక, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని రెల్లి వీధిలో జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. 17 ఏళ్ల బాలికకు వివాహం జరిపిస్తున్నట్టు సీడీపీవో మేరీ సువార్తకు సమాచారం రావడంతో టౌన్ ఎస్‌ఐ సుధాకర్‌తో కలిసి ఆ బాలిక ఇంటికి బుధవారం వెళ్లారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, వివాహం జరిపించవద్దని బాలిక తల్లిదండ్రులకు సీడీపీవో కౌన్సెలింగ్ ఇచ్చారు. అధికారుల రంగ ప్రవేశంతో బాల్య వివాహం నిలిచిపోయింది.

వృద్ధుడి అదృశ్యం



ఒమ్మి రాములు(ఫైల్)

మాకవరపాలెం: మండలంలోని జి.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి రాములు(70) అనే వృద్ధుడు అదృశ్యమైనట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ నెల 17న మాకవరపాలెంలోని బ్యాంకుకు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లోనూ, బంధువుల ఇళ్లవద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 9440904216 అనే నంబర్‌కు తెలియజేయాలన్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

అనకాపల్లిటౌన్: మండలంలో బవులవాడ సమీపంలో బుధవారం 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ నర్సింగరావు చెప్పారు. పాడేరు నుంచి అనకాపల్లికి గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తమ సిబ్బంది బుధవారం వాహనాలు తనిఖీ చేశారని చెప్పారు. తమ సిబ్బందిని గంజాయి రవాణాదారులు గమనించారని, మరో వాహనంలో అనకాపల్లికి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్‌ఐ చెప్పారు.

25 నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు



కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రేంజ్ డీఐజీ హరికృష్ణ

ఆరిలోవ (విశాఖ): స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్‌ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కైలాసగిరిలోని ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 23 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ అనకాపల్లి ఎస్పీ కె.వి.మరళీకృష్ణతో కలసి బుధవారం మైదానాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ కోసం ఇంతవరకు జరిగిన ఏర్పాట్లను పరిశీలించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ విశాఖ రేంజ్ పరిధిలో నిర్వహించిన రాత పరీక్షలో 17,374 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. వారికి ఈ నెల 25 నుంచి శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన 2,745 మంది మహిళా అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు ప్రత్యేకంగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మెటాలిక్, స్పైక్స్ షూస్ ధరించి రావద్దని సూచించారు. అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ చాలా కీలకం

ఎస్పీ మురళీకృష్ణ



సబ్బవరం: విద్యార్థి దశ అనేది ఒక రంగుల కల లాంటిది.. ఆ సమయంలో ఎలాంటి బలహీనతలను దరి చేరనీయకుండా విద్యాభ్యాసం పూర్తి చేసి తమ తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ సూచించారు.దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితంలో చాలా ముఖ్యమైన దశ అన్నారు. ఈ దశలో అనేక రకాల బలహీనతలు విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పారు. అలాంటి వాటిలో మాదకద్రవ్యాల వినియోగం ఎంతో ముఖ్యమైనదని, ఇలాంటి బలహీనతలకు గురికాకుండా విద్యార్థులు తమను తాము నియంత్రించుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్స్ యాక్ట్-1985 ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం,వాటిని కలిగి ఉండటం చట్టవ్యతిరేకమైన చర్య అని తెలిపారు. ప్రజల్లో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 14500తో కూడిన హోర్డింగ్‌లను కళాశాలలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గంజాయి అక్రమ రవాణా నివారణలో భాగంగా ఇప్పటి వరకూ జిల్లాలోని 8 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ, రిజిస్ట్రార్ డాక్టర్ జోగినాయుడు,పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ రంగనాథం, ఎస్‌ఐ ఎల్. సురేష్, అకడమిక్ డీన్ డాక్టర్ సోమా భట్టాచార్య,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సైకో అయ్యన్నా.. నోరు అదుపులో పెట్టుకో

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఫైర్



నర్సీపట్నం: సైకో అయ్యన్నా నోరు అదుపులో పెట్టుకోకపోతే..నాలుక కోస్తానంటూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఫైర్ అయ్యారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ మెప్పు పొందేందుకు యువగళం సభలో అయ్యన్నపాత్రుడు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభ్యతాసంస్కారం లేకుండా ముఖ్యమంత్రిని ఏకవచనంతో సంబోధిస్తున్న అయ్యన్నపాత్రుడికి వయస్సు పెరిగేకొద్దీ పిచ్చి పరాకాష్టకు చేరుతోందని తెలిపారు. చంద్రబాబు సీఎం స్థానంలో ఉన్నప్పుడు ఏ పార్టీ నాయకులు అయ్యన్నపాత్రుడులా విమర్శలు చేయలేదని చెప్పారు. వయస్సు పెరిగేకొద్దీ అయ్యన్నపాత్రుడు సైకోలా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. రాజకీయ భిక్షపెట్టిన ఎన్టీ రామారావును చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు వెన్నుపోటు పొడిచి చావుకు కారణమయ్యారని చెప్పారు. ప్రజలు ఛీ కొట్టినా అయ్యన్నపాత్రుడుకు బుద్ధి రాలేదన్నారు. మరోసారి అయ్యన్నపాత్రుడిని, చంద్రబాబును తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ టూర్ వెళ్తున్నారు తప్ప..మీ చంద్రబాబులా ప్రధాని నరేంద్రమోదీకి భజన చేయడానికి కాదని ఎమ్మెల్యే గణేష్ అన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో హేమంత్



ఒంపోలులో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హేమంత్

మునగపాక: ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎ.హేమంత్ తెలిపారు. మండలంలోని ఒంపోలులో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇస్తున్న మందుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. టీకాలు వేసే కార్యక్రమాలను శతశాతం పూర్తి చేయాలన్నారు. రక్తపోటు, మధుమేహ వ్యాధి గ్రస్తులను గుర్తించి యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వైద్యాధికారి శబ్నం,సీహెచ్‌వో దేవకాంత, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతెరిగిన భావి ఓటర్లు

- కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాధారణ ఎన్నికల మాదిరిగా ఎస్పీఎల్ పోలింగ్
- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు



ఓట్లు లెక్కిస్తున్న ఉపాధ్యాయులు



ఓటు వేస్తున్న విద్యార్థి

రోలుగుంట: వారందరూ 15 సంవత్సరాలలోపు వారే. పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరి నిలుచుకున్నారు. బూత్‌లోకి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుని ఎంతో శ్రద్ధగా తమ నాయకుడిని ఎన్నుకున్నారు. సాధారణ ఎన్నికల వలే మండలంలోని కుసర్లపూడి జెడ్పీ ఉన్నతపాఠశాలలో బుధవారం పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు వినియోగించుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆ పాఠశాలలో ఎస్పీఎల్ ఎన్నిక నిర్వహించారు. సాధారణ ఎన్నికల మాదరిగా వీటిని జరిపారు. ఎన్నిక నిర్వహణకు ముందు హెచ్ఎం మోహన్‌రావు ఎన్నికల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాయకత్వ లక్షణాలు దీని ద్వారానే అలవడుతాయని చెప్పారు.

ఉపాధ్యాయులు అప్పన రాంబాబు, యు.జాగ్గారావు ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆరుగురు విద్యార్థులు పోటీ చేశారు. పోలింగ్ అనంతరం సాధారణ ఎన్నికల మాదరిగానే బ్యాలెట్ పేపర్లను వేరు చేసి, కట్టలు కట్టి భద్రపరిచారు. సీనియర్ ఉపాధ్యాయులు విద్యావతి, శ్రీనివాస్, రావు, రమేష్, భార్గవి,డి.నానిబాబు, సాంబశివరావు ఓట్లను లెక్కించారు. మద్దు విష్ణువర్ధన్‌కు 82 ఓట్లు రావడంతో అతన్ని ఎస్పీఎల్‌గాను, 70 ఓట్లు తెచ్చుకున్న టి.గీతామాధురిని వైస్ ఎస్పీఎల్‌గా ఎన్నికైనట్టు హెచ్ఎం ప్రకటించారు.

విద్యుత్ షాక్ ఘటనపై విచారణ

విచారణ జరిపిన ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్) జీఎం తిలక్

చోడవరం: స్థానిక ద్వారకానగర్‌లో విద్యుత్ స్తంభం పైకి ఎక్కి షాక్‌గురైె హెల్పర్ తీవ్రంగా గాయపడిన ఘటనపై ఏపీడీసీఎల్ ఉన్నతాధికారులు బుధవారం విచారణ జరిపారు. ఈనెల 22న చోడవరం-లక్ష్మీపురం రోడ్డులో ద్వారకానగర్ సమీపంలో మరమ్మతుల కోసం విద్యుత్ స్తంభం ఎక్కి షాక్‌కు గురైన హెల్పర్ లక్ష్మణరావు ఆస్పత్రితో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంపై ఇక్కడి విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఈస్ట్రన్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఆపరేషన్స్) జనరల్ మేనేజర్ తిలక్ విచారణ చేశారు. నిర్లక్ష్యంగా ప్రైవేటు వ్యక్తిని విద్యుత్ స్తంభం ఎక్కించి పనిచేయించిన స్థానిక జూనియర్ లైన్‌మెన్ ప్రసాద్‌తోపాటు లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌ను, పట్టణ ఏఈ, సబ్ డివిజనల్ అధికారులను విచారించారు. ప్రమాదం ఎలా జరిగింది. ప్రైవేటు వ్యక్తిని ఎందుకు విద్యుత్ స్తంభం ఎక్కించాల్సి వచ్చింది, అక్కడ ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న దిగువస్థాయి సిబ్బంది ఏమి చేస్తున్నారనే అంశంపై జీఎం తిలక్ పూర్తిస్థాయిలో విచారణ చేసినట్టు తెలిసింది. సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది అందర్నీ ఒకొక్కర్నీ పిలిచి విచారించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి శాఖాపరమైన చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ విచారణలో నర్సీపట్నం డివిజనల్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు. విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడిన లక్ష్మణరావుకు విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నప్పటికీ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగానే ఉన్నట్టు ఆయన బంధువులు తెలిపారు.

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం నేడు

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం జరగనుంది. మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. 30 అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. జోన్-3 పరిధి 19వ వార్డు లాసన్స్ బే పార్క్‌లో రూ.36.53 లక్షలతో బ్యాడ్మింటన్ కోర్టు, యోగా ఫ్లోరింగ్, ఓపెన్ స్టేజ్, జిమ్ బాటమ్ పేపర్ ఫ్లోరింగ్, నీటి సరఫరా మరమ్మతులు, జోన్-5 పరిధి 52వ వార్డు గౌరీనగర్‌లో నిర్మిస్తున్న శానిటరీ, సచివాలయ భవనంలో మిగిలిన పనులు చేపట్టేందుకు పరిపాలన పరమైన అనుమతి, 52వ వార్డు మర్రిపాలెంలోని పోస్టాఫీస్ వద్ద వరదనీటి కాలువ నిర్మాణం, కరాసలో వరద నీటి కాలువ, గణేష్ నగర్ నుంచి గౌరీనగర్ వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి పరిపాలన అనుమతి కోసం చర్చించనున్నారు. జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్లుగా ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పలువురికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ మంజూరు, జోన్-8లో 89 నుంచి 98వ వార్డుల వరకు పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బంది నియామకం, జోన్-3 పరిధి విద్యానగర్ వాణిజ్య సముదాయంలో కాంట్రాక్ట్‌కు ఇచ్చిన పలు దుకాణాలు, డైమండ్ పార్క్ వాణిజ్య సముదాయంలో దుకాణం నంబర్ 3కు నెలసరి అద్దె పెంపు తదితర అంశాలపై సభ్యులు చర్చించనున్నారు.

ఏయూతో ఐసీటీ అకాడమీ ఎంవోయూ



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఏయూ, ఐసీటీ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఐసీటీ అకాడమీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసీటీ అకాడమీ సీఈవో హరి బాలచంద్ర సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఐసీటీ అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అవసరమైన సేవలను ఐటీసీ అందిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు పొందే అవకాశం ఉంది. ఏయూ ఆచార్యుల పరిశోధన పత్రాలను ఐసీటీ జర్నల్స్‌లో ప్రచురిస్తారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆచార్య సీఆర్ రావు సంస్మరణ సభ



సి.ఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆచార్యులు

ఏయూక్యాంపస్:ఆంధ్ర విశ్వవిద్యాలయం సాంఖ్యాకశాస్త్ర విభాగంలో బుధవారం ఆచార్య సి.ఆర్ రావు సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు ఆచార్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆచార్య సి.ఆర్.రావు సాధించిన ప్రగతిని విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి విద్యార్థులకు వివరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, స్టాటిస్టిక్స్ విభాగం సీనియర్ ఆచార్యుడు ప్రొఫెసర్ కె. శ్రీనివాసరావులు సి.ఆర్.రావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2010లో 15 రోజుల పాటు ఆయన ఏయూలో లెక్చర్స్ నిర్వహించారన్నారు. ఆచార్య జి.వి.రవీంద్రనాథ్ బాబు, మాజీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ప్రసాద్ బాబు, మ్యాథ్‌మెటిక్స్ విభాగాధిపతి ఆచార్య జి. నానాజీ రావు, అనువర్తిత గణితశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం



రోగి ఎక్స్‌రేను పరిశీలిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని మంగళవారం రాత్రి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి సందర్శించారు. వైద్యాలయంలో అత్యవసర విభాగంతోపాటు పలు వార్డులను తనిఖీ చేశారు. వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగుల వద్ద ఉన్న ఎక్స్‌రే, మందుల చీటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సత్వర, మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన వెంట అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

పట్టణంలో దోమల మందు పిచికారీ



దోమలమందు ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం జీవీఎంసీ సిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు రఘురాంకాలనీ, లక్ష్మీనారాయణ నగర్, కోట్నివీధి, పిళ్లావారివీధి, చేపలబజారు, పప్పులవీధి, జంపావారివీధి, చిన్నవీధి ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు తీసుకున్నారు. స్థానిక నివాసులు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

అనకాపల్లిటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని, తన తల్లి మృతి చెందినట్లు పాతబర్మాకాలనీకి చెందిన మాదాబత్తుల అప్పలరాజు బుధవారం రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. మంగళవారం రాత్రి పిసినికాడ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని మోటారు ఢీకొని మాదాబత్తుల నాగమణి గాయపడింది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లురూరల్ పోలీసులు చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 138 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,650
రెండో రకం	4,030	4,070
మూడోరకం	3,650	4,030

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
పిజ్జా	:	సత్యనారాయణ స్క్రీన్-1
డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-31 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 370 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 427 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

చేతికందిన చందమామ

- చంద్రయాన్-3కి సంఘీభావంగా స్కూళ్లలో విన్యాసాలు
- ఊరూవాడా మిన్నంటిన సంబరాలు

చందమామ రావే.. జాబిల్లి రావే.. అని పాడుకున్న రోజులు పోయాయి. తను రాలేదన్న విషయం తెలిసిన ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ని విజయవంతంగా మామ చెంతకు చేర్చారు. కోట్ల భారతీయులు ఊపిరిని ఉగ్గబట్టుకుని చేసిన నిరీక్షణకు తెరదించారు. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరిన తొలి దేశంగా భారత్‌కు ఖ్యాతినిచ్చారు. దీంతో నియోజకవర్గంలో ఊరూవాడా ఏకమై సంబరాలు చేసుకున్నారు.



ఏఎంఏఏ స్కూల్‌లో విద్యార్థుల విన్యాసం

అనకాపల్లి రూరల్: ఇస్రో చంద్రయాన్-3 ప్రయోగం పూర్తిగా విజయవంతం కావడంతో కొత్తూరు ఏఎంఏఏ హైస్కూల్‌లో బుధవారం సాయంత్రం విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాల అధ్యక్షుడు కర్నాటకపు నారాయణరావు, కరెస్పాండెంట్ కొణతాల శివకుమార్, వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, పెదబాబు, తమ్మిన రఘుబాబు తదితరులు ఇస్రో శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన జయహో ఇస్రో విన్యాసం విశేషంగా ఆకట్టుకుంది. జయహో భారత్.. జయహో ఇస్రో అంటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు.

మరచిపోలేని అనుభూతి



చందమామను చూపి గోరుముద్దలు తినిపించేవారిమని అమ్మానాన్న చెప్పేవారు. ఇపుడు చంద్రుడిపైకి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం, చందమామే మన దేశానికి చేరువైందన్నంత ఆనందంగా ఉంది. ఇటువంటి అద్భుత ప్రయోగాన్ని చివరి వరకూ వీక్షించే అవకాశం లభించడం మరచిపోలేని మధురానుభూతి.

-ఎం.వైభవ్ శ్యాంకుమార్, విద్యార్థి, అనకాపల్లి

శాస్త్రవేత్తలకు సెల్యూట్



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కాగలదని ముందే ఊహించాను. ప్రపంచ ఖగోళ శాస్త్ర ప్రయోగాల్లో భారత్‌కు సాటిలేదని మరోసారి ప్రూవ్ అయింది. అంతరిక్ష ప్రయోగాల్లో గొప్పగా చెప్పుకునే రష్యా ప్రయోగం విఫలమైన చోట, భారత జెండా ఎగరడం గర్వకారణం. అందుకు కృషి చేసిన శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నా.

– సిరిపురపు రాము, విద్యార్థిని, అనకాపల్లి

తోడపెద్దు పాలుకొలుపు పోస్టర్ ఆవిష్కరణ



తోడపెద్దు పాలుకొలుపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలో సెప్టెంబర్ 2న జరిగే తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆవిష్కరించారు. బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆడారి యర్ర వెంకయ్య గారి తోడపెద్దు పాలుకొలుపు మహోత్సవంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సూరిశెట్టి కన్నారావు, ఆడారి సత్యనారాయణ, లక్ష్మణరావు, పెంటకోట జగ్గప్పారావు, వెలగా అప్పలనాయుడు, సూరిశెట్టి దుర్గునాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, వేగి కృష్ణ, వెలగా రామకృష్ణ, సూరిశెట్టి గోవింద పాల్గొన్నారు.

ఈ పంట నమోదుపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు



ఈ పంట నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

యలమంచిలి : రైతులు ఈ పంట నమోదు పక్కాగా నమోదు చేసుకునేలా వ్యవసాయాధికారులు చూడాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. బుధవారం మండలంలో తెరువుపల్లి గ్రామంలో పంట పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడి పంటల వివరాలు తెలుసుకొని వాటి వివరాలు ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. యలమంచిలి మండల వ్యవసాయాధికార కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న అన్ని రకాల పంటలను ఈ కర్షక్ యాప్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. యలమంచిలి డివిజన్‌లో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని, పీఎమ్ కిసాన్ పెండింగ్‌లో ఉన్న రైతులకు ఈకేవైసీ తప్పని సరిగా నమోదు చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు



పాఠశాలకు ఫ్యాన్లు,పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నారని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మునగపాక దళితవాడలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు అందజేసిన పలు సామాగ్రిని బుధవారం సాయంత్రం పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నా రు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి రామ్మోహనరావు, అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ బుజ్జిబాబు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాశీబాబు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



నాగులాపల్లిలో రక్తదానం చేస్తున్న దాతలు

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి స్పందన వచ్చింది. బీజేపీ జిలా ఐటీ విభాగం నాయకుడు మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి స్టేజిపై ఏర్పాటు చేసిన శిబిరానికి 25 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గండి సత్యనారాయణ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు సంయుక్తంగా ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో శరగడం జగన్‌మోహన్‌రావు, యల్లపు వెంకటప్పారావు, మూర్తి, గల్లా రాజేశ్వరరావు, సర్పంచ్ జామి చినమ్మలు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వరి వెదజల్లుకోవడం మంచిది



రైతులకు సూచనలిస్తున్న ఏవో ప్రసాద్

నక్కపల్లి: వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు వరిని వెదజల్లు కోవడం మంచిందని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. మండలంలో బుధవారం కాగితలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వరినారు మడులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ 5125 ఎకరాలు సాధారణ సాగుకి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో 550 ఎకరాలలో మాత్రమే నాట్లు పూర్తయ్యాయన్నారు. సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 481 ఎంఎంకి గాను 301 ఎంఎం మాత్రమే 38 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. అందుబాటులో నీరు లేక నారుమడులు ఎండిపోతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పడిన వర్షంతో వరిని వెదజల్లుకోవడం మంచిదన్నారు. దీని వల్ల నారుమడి వేసుకునే అవకాశం లేదన్నారు. కూలీల కొరత వల్ల నారుమడి కాకుండా వెదజల్లుకోవడం మంచిదని సూచించారు. విత్తనం ఒకరోజు నానబెట్టిన తర్వాత పొలంలో వెదజల్లుకోవాలన్నారు. ఈ పద్ధతిలో పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు. వేర్లు బలంగా పెరుగుతాయని, చీడపీడల బాధ తక్కువగా ఉంటుందన్నారు. వెదజల్లు పద్ధతిలో కలుపు యాజమాన్యం ముఖ్యంగా చూసుకోవాలన్నారు. విత్తిన మూడురోజులకు, ఇరవై ఐదు రోజులకు కలుపు యాజమాన్యం చేపట్టాలన్నారు.

రహదారి ఛిద్రం



అధ్వానంగా మారిన వెంకటాపురం రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వాడచీపురుపల్లి ఎస్సీ వసతి గృహం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల నిడివి కలిగిన రహదారి రాళ్లు తేలి నడవడానికి కూడా వీల్లేని దుస్థితికి చేరింది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తమ విధులకు వెళ్లడానికి నానా పాట్లు పడాల్సి వస్తోంది. తమ ఇబ్బందులను గుర్తించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రమ్మీ ఆడుతున్న ముగ్గురి అరెస్టు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు సిమ్మన్నగారి ఊరు శివార్లలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి... ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న వారిలో ముత్యాలమ్మపాలేనికి చెందిన మైలపల్లి బంగార్రాజు, మైలపల్లి పోలరాజుతో పాటు తంతడి గ్రామానికి చెందిన చోడిపల్లి పైడిరాజు కలిసి సిమ్మన్నగారి ఊరు సమీపంలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్నట్లు బుధవారం సాయంత్రం 7గంటల సమయంలో సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడడానికి ఉపయోగించిన 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని సీఐ ఈశ్వరరావు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప స్టేషన్‌కు అందించాలని కోరారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు

పాయకరావుపేట : మండలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతుందని అధికారులు చర్యలు తీసుకోవాలని పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు బుధవారం వివరాలు విలేకరులకు తెలిపారు. మండలంలో ఏవిధమైన అనుమతులు లేకుండా ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లతో గ్రావెల్ అక్రమంగా రవాణా జరుగుతుందన్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్తమ్మ తల్లి పండగ నేడు



రాంబిల్లి : పెదకలవలాపల్లి గ్రామంలో గురువారం కొత్తమ్మతల్లి పండగను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యలమంచిలి కనకారావు తెలిపారు. పండగ సందర్భంగా పెదకలవలాపల్లి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అమ్మవారి ఆలయం సహా గ్రామంలో విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సందర్శన



గణపర్తి శాఖా గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

మునగపాక : గణపర్తి శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరమణ సందర్శించారు. గ్రంథాలయంలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి వస్తున్న పాఠకుల సంఖ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంచేలా చూడాలని, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారి అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

రాంబిల్లి : పర్యావరణ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని లాలంకోడూరు సర్పంచ్ లాలం రమణమూర్తి అన్నారు. ఈ గ్రామంలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించి చెట్లుగా పెరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి), ఉపాధి పథకం ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టంగుటూరి ఆశయ సాధనకు పాటుపడాలి



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లిటౌన్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని డీఎస్పీ వి.సుబ్బరాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత టంగుటూరిని స్ఫూర్తిగా తీసుకుని దేశసేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఈశ్వరరావు, ఎస్ఐలు రమణయ్య, లక్ష్మణరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని పరవాడపాలెం గ్రామంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఆయన ముఖ్యమంత్రిగా అందించిన సేవలను ప్రస్తుతించారు. ఉగ్గిన గంగునాయుడు సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. కోట్నివీధి మరిడిమాంబ పండగను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు నెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రోజువారి పనుల ఒత్తిడిలో ఉన్న వారికి ఇలాంటి పోటీలు ఆటవిడుపునిస్తాయన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి, 84వ వార్డు ఇన్‌చార్జి కొణతాల రాఘవ మాట్లాడుతూ ఈ నెల 31న అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఏడు రోజులపాటు జరుగుతాయన్నారు. ప్రథమ విజేతకు రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు కూడా అందించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎస్ఐ సత్యనారాయణను కోరుకొండ రాఘవ మిత్ర మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, సభ్యులు అలం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా నూకరాజు, కె.నాగరాజు, ఎల్.స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

శతశాతం ఓటర్ల జాబితా సిద్ధం



రాజకీయపార్టీల నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: డివిజన్ పరిధిలో శత శాతం ఓటర్ల జాబితాను సిద్ధం చేసినట్లు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఇప్పటికే ఓటర్లు జాబితా 98 శాతం పూర్తి అయిందన్నారు. గవరపాలెం నిదానందొడ్డిలో సుమారు 200 మంది ఓటర్లు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించామన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి తుది జాబితాను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని బీఎల్వోలను ఆయన కోరారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు గొర్లి సూరిబాబు, కొణతాల హరనాథబాబు, ఐఆర్ గంగాధర్, రామచంద్రరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావు

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణితో దురుసుగా ప్రవర్తించిన పల్లి వెంకటరమణ అనే వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా అప్పారావు చెప్పారు. పెదముషిడివాడలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పల్లి వెంకటరమణ అనే వ్యక్తి ఈ నెల 20న సర్పంచ్ ఇంటి ముందు నిలబడి ఆమె అనుమతి లేకుండా ఫొటోలు చిత్రీకరించాడని చెప్పారు. తన అనుమతి లేకుండా ఫొటోలు తీయడం తగదని సర్పంచ్ నాగమణి అభ్యంతరం చెప్పడంతో ఆమెపై సదరు వ్యక్తి దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాషలాడుతూ గట్టిగా నెట్టివేయడంతో తన తల్లి కింద పడిపోయారని అప్పారావు వివరించారు. తన తల్లిని నెట్టివేసిన సదరు వ్యక్తిని నిలదీయడంతో తనపై కూడా అతను దురుసుగా ప్రవర్తించాడని చెప్పారు. అక్కడే ఉన్న స్థానికులు కల్పించుకొని ఇరువర్గాలను సముదాయించి ఘర్షణను నివారించారన్నారు. తమపై దురుసుగా ప్రవర్తించిన పల్లి వెంకటరమణపై పరవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావు వివరించారు. మీడియా సమావేశంలో సర్పంచ్ పల్లా నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నందవరపు శ్రీనివాసరావు, ఒమ్మి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పరవాడ: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు కొనియాడారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేశారన్నారు. తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజ, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు చల్లా కనకరావు, రెడ్డి శ్రీనివాసరావు, కావలి రాజు, వాసు, వర్రి హరి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ప్రకాశం పంతులు

సబ్బవరం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయుడని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. కళాశాలలో ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం పంతులు జాతీయ నాయకత్వంలో,స్వాతంత్ర్య సమరంలో పోషించిన పాత్ర యువతకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు రామకృష్ణ,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.